క్లుప్తంగా

పోషణ్ పఖ్వాడాపై అవగాహన



మోదుకూరు(వేమూరు): చుండూరు మండలంలోని మోదుకూరు గ్రామంలో పోషణ్ పఖ్వాడా కార్యక్రమంలో భాగంగా బుధవారం గర్భవతులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారం ప్రాముఖ్యత గురించి అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సునీత అవగాహన కల్పించారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భవతులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారం అందించడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సులు, ఆశా వర్కర్లు, ఎమ్ఎల్‌హెచ్‌పీలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

దివ్యాంగ బాలలకు వైద్య శిబిరం



వేమూరు: జీవన నైపుణ్యాలు పెంపొందించుటకు దివ్యాంగ బాలలకు ఉపకరణాల క్యాంపు నిర్వహించడం జరుగుతుందని మండల విద్యాశాఖాధికారి రోజ్‌ల్యాండ్ తెలిపారు. జంపని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష అధికారుల ఆదేశానుసారం జంపని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దివ్యాంగ బాలలకు ఈ నెల 22న క్యాంపు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ క్యాంపులో ఎముకల వైద్య నిపుణులు మోహన్ రాజు పాల్గొంటారని తెలిపారు. ఈ క్యాంపులో దివ్యాంగబాలలకు సర్టిఫికేట్లు అందజేయడం జరుగుతుందని ఆమె చెప్పారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన దివ్యాంగ బాలలు క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

31వ తేదీ వరకు పన్ను చెల్లింపుపై వడ్డీ మాఫీ

పొన్నూరు: పన్ను బకాయిదారులకు ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. ఈ ఏడాది వడ్డీ లేకుండా పన్ను చెల్లించే సదుపాయాన్ని ప్రజలకు కల్పించింది. మార్చి నెలాఖరు వరకు ఇంటి పన్ను ఒకేసారి చెల్లిస్తే వడ్డీ కట్టాల్సిన పనిలేకుండా చేసింది. పొన్నూరు పురపాలక సంఘ పరిధిలో 31 వార్డులకు సంబంధించి 17 సచివాలయాల పరిధిలో మొత్తం 14,950 హౌస్ హోల్డ్ ఉన్నాయి. 4,700 ఖాళీ స్థలాలకు అసెస్మెంట్లున్నాయి. మొత్తం 19,500 అసెస్మెంట్లకు గానూ రూ.4.61 కోట్ల మేర పన్ను వసూలు చేయాల్సి ఉంది. ఈ నెల ఒకటి నుంచి ప్రభుత్వం ఇంటి, ఖాళీ జాగా పన్ను వసూలుకు వడ్డీ మాఫీ ఇవ్వడంతో అసెస్మెంట్‌దారులు ఈ నెల 20 వరకు రూ.3 కోట్లు పన్ను చెల్లించారు. కమిషనర్ నయీం అహ్మద్ ఆదేశాలతో సచివాలయ సిబ్బంది పన్ను వసూలుపై ప్రత్యేక దృష్టిసారించారు. వడ్డీ లేకుండా ఇంటి పన్ను కట్టేందుకు మంచి అవకాశం వచ్చింది. ఏళ్ల తరబడి ఇంటి పన్ను కట్టని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు.

ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



పొన్నూరు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని పొన్నూరు రిటర్నింగ్ అధికారి ఎ.లక్ష్మీకుమారి హెచ్చరించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఎన్నికల నిబంధనలపై అధికారులతో సమావేశం బుధవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో, ప్రయివేటు ఇళ్లపై ఉన్న పోస్టర్లు, బ్యానర్లు తొలగించాల్సి ఉందని చెప్పారు. ప్రయివేటు ఇళ్లపై ఉన్న వాటిని యజమానుల అనుమతి మేరకు తొలగించబోమని తెలిపారు. ఇంటిలో ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తే ఆ పార్టీ అభ్యర్థి ఖర్చు పరిధిలోకి వస్తుందన్నారు. నియోజకవర్గం, మండల, గ్రామస్థాయిలో ఏర్పాటు చేసే పార్టీ కార్యాలయాలకు ఆర్‌ఓ అనుమతి తప్పనిసరి అన్నారు. బహిరంగ ప్రదేశాల్లో సభలకు పరిమితులకు లోబడి అనుమతి ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల నియమావళి వందశాతం అమలు చేయాల్సిందేనని తెలిపారు. ఆ మేరకు అధికారులు ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ నయీం అహ్మద్, ఈఆర్వో హరిహరనాథ్, తహసీల్దార్ నారాయణ సింగ్, పట్టణ, రూరల్ సీఐలు భాస్కర్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నవరత్నాల అమలుతో వైఎస్సార్ సీపీ విజయానికి బాటలు

వేమూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి



జువ్వలపాలెంలో నాయకులతో చర్చిస్తున్న వరికూటి అశోక్‌బాబు, బౌడ చైర్మన్ దేవినేని

కొల్లూరు : పేద ప్రజానీకం అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి బాటలుగా మారనున్నాయని వేమూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు అన్నారు. బుధవారం మండలంలోని జువ్వలపాలెం, గుంటూరుగూడెం, తడికలపూడి, కిష్కిందపాలెం గ్రామాలలో వైఎస్సార్ సీపీ శ్రేణులను కలిసిన ఆయన రానున్న ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి ఎన్నికల మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావించి అమలు చేసిందన్నారు. నవరత్నాల అమలుతో పాటు హామీ ఇవ్వని పథకాలను సైతం అమలు చేసి ప్రజల మనస్సుల్లో చెరగని ముద్ర వేసుకుందన్నారు. అవినీతికి తావులేకుండా ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు నేరుగా అందించి అర్హత గల ప్రతి లబ్ధిదారునికి మేలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందన్నారు. రాజకీయాలకు అతీతంగా బడుగు, బలహీన, పేద వర్గాలకు మేలు చేసి ప్రజల హృదయాలలో సుస్థిర స్థానాన్ని ఏర్పరుచుకున్నారని కొనియాడారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మేలును చూసి ఓర్వలేని టీడీపీ నాయకులు చేస్తున్న దుష్ప్రచారాలను ప్రజలంతా గమనిస్తూనే ఉన్నారన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీకి ప్రజల చేతిలో చావుదెబ్బ తగలబోతుందని జోస్యం చెప్పారు. ప్రతి కుటుంబానికి మేలు చేసే విధంగా పరిపాలన సాగించిన వైఎస్సార్ సీపీకి రానున్న ఎన్నికల్లో ప్రజలంతా అండగా నిలిచి ఘన విజయాన్ని చేకూర్చాలని కోరారు. కార్యక్రమంలో బౌడ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, మండల కన్వీనర్ సూర్యదేవర రామకృష్ణ, వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, సర్పంచ్‌లు భూపతి కిశోర్, సనక వెంకట్రావు, సూరపనేని వెంకటేశ్వరరావు, గుంటూరు నీలాంబరం, ఎంపీటీసీ సభ్యులు గుంటూరు రామారావు, బుల్లా నవరత్నం, పొలిమట్ల జోసఫ్, బావిరెడ్డి వెంకట్రామయ్య, ఇంటూరి ప్రవీణ్, మాజీ సర్పంచ్‌లు కట్టుపల్లి సోమయ్య, ముత్తిరెడ్డి వెంకట సుబ్బారావు, నాదెండ్ల నరేంద్ర, వేమినేని గోపాలకృష్ణ, నాదెండ్ల ప్రకాశరావు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి అమలుపై అలసత్వం



క్రాప అడ్డరోడ్డు వద్ద విద్యుత్తు పోల్‌కు అతికించి ఉన్న టీడీపీ ఫ్లెక్సీ



పెసర్లంక రామన్నపేట వద్ద సిమెంట్ కట్టడంతో దర్శనమిస్తున్న జనసేన ఎన్నికల గుర్తు గాజు గ్లాసు

- నిబంధనల అమలులో అధికారుల వైఫల్యం
- బహిరంగ ప్రదేశాలలో రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, చిహ్నాలు

కొల్లూరు : ఎన్నికల నిబంధనల అమలులో అధికారుల అలసత్వం, రాజకీయ పార్టీల లెక్కలేని తనం కారణంగా ఎన్నికల కోడ్ కొండెక్కుతుంది. ఎన్నికల నిర్వహణ విషయంలో కట్టు దిట్టమైన నియమ నిబంధనలను అమలు చేయాలన్న ఎన్నికల కమిషన్ ఆదేశాలు క్షేత్ర స్థాయిలో ఆచరణకు నోచుకోవడం లేదు. రాజకీయ పార్టీలకు సంబంధించిన చిహ్నాలు, ఇతర ఫ్లెక్సీలను ఆదివారం మధ్యాహ్నం లోపు తొలగించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ నేటికీ ఆచరణకు నోచుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చి 4 రోజులు అయినప్పటికీ మండలంలోని పలు గ్రామాలలో నేటికీ రాజకీయ పార్టీలకు సంబంధించిన జెండాలతో పాటు ఆయా పార్టీల చిహ్నాలు, ఫ్లెక్సీలు దర్శనమిస్తూనే ఉన్నాయి. మండంలోని క్రాప అడ్డరోడ్డు వద్ద తెనాలి-రేపల్లె ప్రధాన రహదారి వెంబడి విద్యుత్తు పోల్స్‌కు టీడీపీ వేమూరు నియోజకవర్గ అభ్యర్థి నక్కా ఆనందబాబు, ఆ పార్టీ నేతలు, నాయకుల ఫోటోలతో జయహో బీసీ పేరుతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయి. మండలంలోని పెసర్లంక రామన్నపేట వద్ద ప్రధాన రహదారి వెంబడి బహిరంగ ప్రదేశంలో సిమెంట్ కట్టడంతో గతంలో ఏర్పాటు చేసిన జనసేన పార్టీకి చెందిన ఎన్నికల గుర్తు గాజు గ్లాసు చిహ్నంతో పాటు ఆ పార్టీ సింబల్ బాహాటంగా కనిపిస్తున్నా ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది.

పాఠశాలల వివరాలు నమోదు చేయాలి

పిట్టలవానిపాలెం: గ్రామ సచివాలయం పరిధిలో ఉన్న పాఠశాలల వివరాలు నమెదు చేయాలని మండల విద్యాశాఖాధికారి ఉయ్యూరి వెంకటేశ్వరరావు తెలిపారు. మండలకేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో బుధవారం ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ డెవలప్‌మెంట్ ఇండెక్సులో గ్రామ సచివాలయ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల వివరాలు నమోదు చేయాలని తెలిపారు. ప్రధానంగా ఆట స్థలాలు, మరుగు దొడ్లు, నాడు-నేడు పథకం ద్వారా చేపట్టిన పనులు, పాఠశాలలకు అవసరమైన వసతులు తదితర వివరాలు నమోదు చేయాలని తెలిపారు. విద్యాహక్కు చట్టం ప్రకారం పేద విద్యార్థులకు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో 25 శాతం మేర సీట్లు కల్పించి ఉచిత విద్యను అందించాల్సి ఉందని చెప్పారు. అందుకు గానూ అర్హత కలిగిన వారు ఈ నెల 25లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్‌లు ఉన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్టా మహోత్సవం



విగ్రహ ప్రతిష్ట అనంతరం హనుమత్ లక్ష్మణ సమేత సీతారామ చంద్రస్వామి వార్లు



అర్చకుల ఆశీర్వాదం పొందుతున్న అంబటి మురళీకృష్ణ

కిలారి, అంబటి ప్రత్యేక పూజలు

మంచాల(చేబ్రోలు): గ్రామంలో నూతనంగా నిర్మించిన హనుమత్ లక్ష్మణ సమేత సీతారామచంద్ర స్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమం బుధవారం వైభవంగా నిర్వహించారు. భక్త బృందం ఆధ్వర్యంలో హనుమత్ లక్ష్మణ సమేత సీతారామచంద్రస్వామి మందిర నిర్మాణాన్ని పూర్తి చేశారు. 16వ తేదీనుంచి పండితులు విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాలను చేపట్టారు. బుధవారం పరివార సమేత సీతారాములవారి ప్రతిష్ఠా కార్యక్రమాన్ని కనుల పండువగా నిర్వహించారు. వివిధ హోమాలు, విశేష పూజలు జరిగాయి. శాంతి కల్యాణం జరిగింది. మంచాల, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వేలాది మందికి భక్తులు అన్న సంతర్పణ జరిగింది. గ్రామ సర్పంచ్ చందు వెంకట సాంబశివరావు దంపతులు ప్రతిష్ఠా పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

కిలారి, అంబటి ప్రత్యేక పూజలు

మంచాల గ్రామంలో నూతనంగా నిర్మించిన హనుమత్ లక్ష్మణ సమేత సీతారామచంద్ర స్వామి మందిర విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవ సందర్భంగా వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంటు అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య, అసెంబ్లీ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

ఓటుతో దేశ భవిష్యత్తు నిర్దేశం



ప్రతిజ్ఞ చేస్తున్న కమిషనర్ శేషన్న, సీఐ దరశథ రామయ్య

తెనాలిఅర్బన్: దేశ భవిష్యత్‌ను మార్చేది ఓటు మాత్రమేనని దానిని అంతా ఉపయోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పిలుపునిచ్చారు. తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బుధవారం స్వీప్ (సిస్టమ్యాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోల్ పార్టిసిపేషన్) అవగాహన ర్యాలీని పట్టణంలో నిర్వహించారు. ఓటు హక్కును ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలంటూ నినాదాలు చేశారు. మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ శివాజీచౌక్ వరకు కొనసాగింది. శివాజీ చౌక్ వద్ద మానవ హారంగా ఏర్పడి ఓటును వినియోగించుకుంటామనే ప్రతిజ్ఞను చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి ఓటు పునాది అని తెలిపారు. దేశంలో నివసించే 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి రాజ్యాంగం ఓటు హక్కును కల్పించిందని చెప్పారు. అర్హులైన వారు తమ ఓటును నమోదు చేయించుకుని వినియోగించుకోవాలన్నారు. ఒన్‌టౌన్ సీఐ దశరథరామయ్య మాట్లాడుతూ ప్రజాస్వామ్య సంప్రదాయాలను పాటిస్తూ స్వేచ్ఛాయుత వాతావరణంలో అందరు ఓటు వేయాలన్నారు. ఎటువంటి ప్రలోభాలకు గురి కావద్దని సూచించారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ అనూషా, ఏసీపీలు సుధాకర్, సుబ్బారావు, మెప్మా సీఎంఎం మాధవరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

24న దళిత ఆత్మీయ సమావేశం

రేపల్లె రూరల్: దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేందుకు ఈ నెల 24న పట్టణంలోని క్లాత్ మర్చంట్స్ హాలులో నియోజకవర్గ దళితుల ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు రేపల్లె నియోజకవర్గ దళితుల ఐక్యవేదిక సభ్యుడు దారం సాంబశివరావు తెలిపారు. దళితుల ఆత్మీయ సమావేశం వాల్ పోస్టర్‌లను స్థానిక కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించి మాట్లాడారు. వివిధ రంగాలలో దళితులు తమ హక్కులు సాధించుకునేందుకు నిర్వహిస్తున్న ఆత్మీయ సమావేశంలో దళితులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు మేడికొండ సుధాకర చంద్రహాసరావు, జూలకంటి బుజ్జిబాబు, కోన శ్రీను, నాగేశ్వరరావు, కె.సజ్జనరావు, సిహెచ్.మణిలాల్, కె.మస్తాన్, రామారావు, నాగేశ్వరరావు, టి.శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు దివ్యాంగ బాలలకు వైద్య శిబిరం

రేపల్లె రూరల్: పట్టణంలోని భవిత స్కూలు ప్రాంగణంలో ఈ నెల 21న గురువారం ఉదయం 9 గంటలకు దివ్యాంగ బాలలకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు స్కూల్ స్పెషల్ ఎడ్యుకేటర్ ఎన్.అనురాధ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య శిబిరంలో దివ్యాంగ బాలలకు వైద్యుల పర్యవేక్షణలో వైద్య సేవలు అందించటంతో పాటు అవసరమైన ఉపకరణాలు అందించనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని దివ్యాంగ బాలలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు గ్రామాల్లో ఆత్మీయ సమ్మేళనం

వేమూరు: వేమూరు మండలంలోని బలిజేపల్లి, అబ్బనగూడవల్లి, పెనుమర్రు గ్రామాల్లో నేడు వైఎస్సార్ సీపీ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బొల్లిముంత ఏడుకొండలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం సాయంత్రం ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమానికి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోకబాబు పాల్గొంటారని చెప్పారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నాలని కోరారు.

అన్ని ప్రదేశాల్లో పటిష్ట నిఘా

ఏఆర్ అడిషనల్ ఎస్పీ హనుమంతు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న అడిషనల్ ఎస్పీ హనుమంతు, డీఎస్పీలు వీవీ నాయుడు, మహబూబ్‌బాషా

ప్రత్తిపాడు: సత్ప్రవర్తనతో నడుచుకుంటూ వివాదాలకు దూరంగా ఉండాలని ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఎ.హనుమంతు రౌడీ షీటర్లకు సూచించారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడు పోలీస్ స్టేషనులో బుధవారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ అన్ని ప్రదేశాల్లో నిఘా నేత్రాలు ఉన్నాయని, ఎక్కడ, ఏ చిన్న గొడవకు పాల్పడినా వెంటనే తెలిసిపోతుందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. ఈ మేరకు రౌడీషీటర్లందరినీ ప్రత్తిపాడు తహసీల్దార్ ఎదుట వ్యక్తిగత పూచీకత్తుపై బైండోవర్ చేశారు. వెంట డీఎస్పీలు వీవీ నాయుడు, గుంటూరు సౌత్‌జోన్ డీఎస్పీ ఎండీ మహబూబ్‌బాషా, సీఐ ఎండీ నిసార్‌బాషా, ఎస్ఐ సోమేశ్వరరావు పాల్గొన్నారు.

చెక్‌పోస్టు పరిశీలన..

బాపట్ల జిల్లా, గుంటూరు జిల్లాల మధ్య నియోజకవర్గంలోని పెదనందిపాడులో ఏర్పాటు చేసిన అంతర జిల్లాల చెక్‌పోస్టును గుంటూరుసౌత్ జోన్ డీఎస్పీ మహబూబ్‌బాషా బుధవారం పరిశీలించారు. వాహనాలు తనిఖీ చేస్తున్న విధానాన్ని పరిశీలించి, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు.

సురక్ష మెడికల్ క్యాంప్‌లతో ఆరోగ్య భరోసా

డీఎంహెచ్‌వో విజయలక్ష్మి



మెడికల్ క్యాంప్‌ను పరిశీలిస్తున్న డాక్టర్ విజయలక్ష్మి

తెనాలిఅర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌తో పేదలకు ఆరోగ్య భరోసా లభిస్తుందని జిల్లా వైద్య,ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి పేర్కొన్నారు. శాలిపేటలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌ను ఆమె పరిశీలించి అక్కడ అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. స్పెషలిస్ట్ వైద్యులు రోగులకు వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలు నివసించే ప్రాంతంలోనే వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో వీటిని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆమె వెంట మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె హెలెన్ నిర్మల, డాక్టర్ వైఎస్ఆర్ అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దివి కిషోర్ కుమార్, డీపీఎంవో శ్యామ్ తదితరులున్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

తెనాలిరూరల్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు కేసు నమోదు చేశారు. దుగ్గిరాల మండలం ఈమని గ్రామంలో ఎస్ఈబీ తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం, సిబ్బంది బుధవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. వ్యక్తి మద్యం విక్రయిస్తుండడాన్ని గుర్తించి పరిశీలించారు. అతని వద్ద 12 మద్యం బాటిళ్లు లభించడంతో వాటిని స్వాధీనపర్చుకుని కేసు నమోదు చేశారు.

వేడుకగా భట్టిప్రోలు తిరునాళ్ల ప్రారంభం

- పెదపులివర్రులో నేత్రానందంగా వరద రాజస్వామి వారి బ్రహ్మోత్సవాలు
- అధిక సంఖ్యలో హాజరైన భక్తులు



శ్రీ మల్లేశ్వరస్వామి వారు



శ్రీ వరదరాజ స్వామి వారు



శ్రీ భూ నీళా అమ్మవారు

భట్టిప్రోలు: భట్టిప్రోలులో కొలువైన శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. స్వామి వారి కల్యాణ మహోత్సవాలే భట్టిప్రోలు తిరునాళ్లగా ప్రసిద్ధి గాంచాయి. ఈ సందర్భంగా స్వామి వారికి బిందె తీర్థం, అభిషేకాలు నిర్వహించారు. రాత్రి నిత్య హోమం, బలిహరణ అనంతరం ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. పూజా కార్యక్రమాలను శాస్త్రయుక్తంగా నిర్వహించారు. ఉదయం నిర్వహించిన బిందె తీర్థం కార్యక్రమంలో కొతరపు పిచ్చయ్యశాస్త్రి-విజయలక్ష్మి దంపతులు పాల్గొన్నారు. అద్దేపల్లి, భట్టిప్రోలు పద్మశాలీయ బహుత్తమ సంఘీయులు పాల్గొన్నారు. కార్యక్రమాలను దేవాలయ కార్యనిర్వహణాధికారి దీవి వేంకట అప్పలాచార్యులు పర్యవేక్షించారు. గురువారం స్వామి వారికి ఉదయం యథాప్రకారం బిందె తీర్థం, అభిషేకం, నిత్యహోమం, బలిహరణతో పా టు రాత్రికి పుష్ప సేవ జరుగుతుందని తెలిపారు.

పెండ్లి కుమారుడైన శ్రీ వరదరాజస్వామి

భట్టిప్రోలు మండలం పెదపులివర్రులో కొలువైన శ్రీ భూ నీళా సమేత శ్రీ వరద రాజస్వామి వారి బ్రహ్మోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్వామి వారిని పెండ్లి కుమారునిగా అలంకరించారు. రాత్రి నిర్వహించిన పూజా కార్యక్రమాలను వేద బ్రాహ్మణులు శాస్త్రయుక్తంగా నిర్వహించారు. దేవాలయ కార్యనిర్వహణాధికారి మేకా సాంబశివరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

మల్లన్నకు మిద్దె రథం

భట్టిప్రోలు: భట్టిప్రోలు గ్రామానికి చెందిన ఉద్దంటి బాలకృష్ణ-లీలావతి దంపతులు శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వారికి మిద్దె రథం, 2 ద్వార పాలకుల విగ్రహాలను బుధవారం బహూకరించారు. ఈ సందర్భంగా పుర వీధులలో మంగళ వాయిద్యాలు, వేద బ్రాహ్మణుల మంత్రోచ్చారణల మధ్య స్వామి వార్లను ఊరేగించి దేవాలయానికి తరలించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గతంలో కల్యాణ మల్లేశ్వరుని గ్రామోత్సవ నిర్వహణ ఎడ్లబండిపై నిర్వహించే వారు. ఈ నేపథ్యంలో సంఘీయుడైన వడ్రంగి కళాకారుడు బాలకృష్ణ ముందుకు వచ్చి స్వామి వారికి స్వయంగా వీటిని తయారు చేసి అందించారు.

మల్లేశ్వర స్వామి రథోత్సవానికి పటిష్ట చర్యలు

ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు



భట్టిప్రోలులో రహదారులను పరిశీలిస్తున్న అధికారులు

భట్టిప్రోలు: ఈ నెల 24న జరిగే భట్టిప్రోలు తిరునాళ్లకు సంబంధించి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్, ఎంపీడీవోలు మునిలక్ష్మి, జేవీబీ మల్లికార్జునరావులు తెలిపారు. శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వర స్వామి వార్ల బ్రహ్మోత్సవాలు ప్రారంభమైన నేపథ్యంలో కల్యాణ మల్లేశ్వరుడు రథోత్సవంపై ఊరేగనున్న రహదారులను బుధవారం రాత్రి అధికారుల బృందం పరిశీలించారు. తహసీల్దార్ మునిలక్ష్మి మాట్లాడుతూ తిరునాళ్లలో భాగంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కోరారు. రహదారిలో అక్కడక్కడ ఉన్న ఆక్రమణలను తొలగించాలని ఆదేశించారు.రథానికి కేబుల్, టెలిఫోన్ వైర్లు అడ్డు లేకుండా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ కాసుల శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి, దేవాలయ కార్యనిర్వహణాధికారి దీవి వెంకట అప్పలాచార్యులు, పంచాయతీ కార్యదర్శి కోట శ్రీనివాసరావు, సంఘీయులు, పోలీస్, పంచాయతీ, విద్యుత్ సిబ్బంది, వంశ పారంపర్య ధర్మకర్తలు పాల్గొన్నారు.

కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు

అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్న భక్తులు



జీవధ్వజ పునః ప్రతిష్టలో పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు మోపిదేవి

రేపల్లె రూరల్: రేపల్లె పట్టణం ఓల్డ్‌టౌన్‌లో వేంచేసియున్న శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయ జీవధ్వజ పునః ప్రతిష్టా వేడుకలు బుధవారం వైభవంగా నిర్వహించారు. సుప్రభాత సేవలతో వాసవీ అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి పట్టువస్త్రాలు, పువ్వులతో ప్రత్యేక అలంకరణ చేశారు. విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాసన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు.రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఈవూరి గణేష్‌లు జీవధ్వజ పునఃప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అన్న సంతర్పణ నిర్వహించారు.